# ఒట్టు

స్టేషన్‌లోకి వచ్చాక బండి అరగంట ఆలస్యం అని తెలిసింది. సుశీలను, పాపను వెయిటింగ్‌రూంలో కూర్చోబెట్టి టికెట్లు కొనుక్కొచ్చాడు రామం. అతను వెయిటింగ్‌రూంలోకి వెళ్ళేసరికి సుశీల పాపను ఎత్తుకొని కిటికీముందు నుంచొని, ఏడుస్తున్నదానిని సముదాయిస్తూ, అప్పటికీ ఊరుకోకపోతే "అదిగో బూచోడు" అని భయపెడుతోంది ఎవరినో చూపించి.

కిటికీ దగ్గరకొచ్చి రామంకూడా అటు చూశాడు.

ఎవరో పిచ్చివాడిని యిద్దరు చెరోరెక్కా పట్టుకుని లాక్కుపోతున్నారు. అతను వాళ్ళను విడిపించుకుని పారిపోదామని గింజుకొంటూ ఏదో నోటికి వచ్చినది వాగుతున్నాడు. పాతికేళ్ళుకూడా వున్నట్టులేవు. దుమ్మూ ధూళితో అట్టగట్టి బొంతల్లా తయారైన చింపిరి బట్టలు, గొర్రెబొచ్చులా వెనక్కూ ముందుకూ వేలాడుతూన్న జుత్తూ, మాసిన గెడ్డం ఆమనిషి వయసుని మభ్యపెడుతున్నాయి. లాక్కుపోతున్నవాళ్ళు అతను కదలకపోతే నాలుగు వడ్డించి మరీ బలవంతంగా తీసుకెళ్తున్నారు. అదేదో చూద్దామని చుట్టూజేరిన జనం—పిల్లలూ పెద్దలు, ఆడాళ్ళూ మగాళ్ళు అతన్ని చూసి నవ్వేవాళ్ళు నవ్వి ఏడిపించేవాళ్ళు ఏడిపిస్తున్నారు.

రామం ఎక్కువసేపు ఆ దృశ్యాన్ని చూడలేకపోయాడు. కళ్ళు తిరుగుతున్నట్టు

అనిపించింది. వచ్చి కూర్చున్నాడు. సుశీల అదేమీ గమనించకుండా పాపను భుజంమీద వేసుకొని జోకొడుతూ అటూ యిటూ ఆ గదిలోనే పచార్లు చేస్తూవుంది.

ఎప్పుడో బండివచ్చినప్పుడు సుశీలేచెప్తే రామం గబగబా వెళ్ళి సెంకడ్‌క్లాసు పెట్టెలోకి యిద్దర్నీ ఎక్కించి, తనూ ఎక్కి, పోర్టరు అందించిన సామానులు సర్ది బండి కదిలేముందు కూర్చున్నాడు.

బండి వెళ్తుండగా సుశీల బయటికి చూపించి ఏమిటో అడిగింది.

అతను ఏదో చెప్పాడు. ప్రశ్నకూ జవాబుకూ సంబంధమేలేదు.

సుశీల మళ్ళీ అడిగింది.

"అదా!........అది కొత్తగా కడుతున్న సినిమాహాలులే" అన్నాడు.

సుశీల నవ్వింది "అంత పరధ్యాన్నమేమిటండీ" అంది.

అతను ఏమీ మాట్లాడలేదు.

ఆ తర్వాత మరో పావుగంటకి ఉన్నట్టుండి రామం అడిగాడు-

"పెళ్ళయ్యేసరికి నేనెలా వుండేవాడిని?"

సుశీల ఆశ్చర్యపోయి అతని ముఖంలోకి చూసింది.

"సరిగ్గా యిందాకటి పిచ్చాడిలాగే వుండేవాడిని కదూ?"అన్నాడు తిరిగి తనే జవాబు చెప్పేస్తూ.

సుశీలకు భర్త యింతసేపూ యీవిషయాన్నే ఆలోచిస్తూ వున్నాడని, అందుకే యింత పరధ్యాన్నంగా, యింత మౌనంగా వున్నాడని అర్థమైంది. ఆయన్ని యీ ఆలోచననుండి తప్పిద్దామని అప్రస్తుతంగా చాలా విషయాలు చెప్తూ కూర్చుంది. ఎప్పటెప్పటివో చిన్నప్పటి విషయాలు జ్ఞాపకం చేసుకుని చెప్పింది. మధ్య మధ్య అతన్నికూడా కబుర్లలోకి దింపి అవీ యివీ అడిగింది. చివరికి పాపను కాస్సేపు ఆడించమని చెప్పి అతనికిచ్చి తాను మేగజైను తీసుకుని పేజీలు తిరగేస్తూ కూచుంది.

రైలు నాలుగైదు పెద్దస్టేషన్లలో ఆగి మళ్ళీ పరుగెత్తి చీకట్లను చేరుకుంది. ఆకాశాన్నీ భూమినీ కప్పుతూ క్రమంగా అంతటా చీకటి దట్టంగా ఆవరించింది. చెట్లూ పుట్టలూ పొలాలూ అన్నీ నల్లని చీకటి ముసుగుల్లోకి వొదిగిపోయాయి. చీకట్లను చీల్చుకుని రైలు ముందుకు దూసుకుపోతోంది. అక్కడక్కడ చిన్న చిన్న పల్లెలు, ఆ

పల్లెల్లో మినుకు మినుకుమనే దీపాలు కనిపించి మాయమవుతున్నాయి. బండిలో లైట్లు వెలిగాయి.

సుశీల అంతకుముందు రాత్రి చాలాసేపటివరకు ప్రయాణానికి సామానులు సర్దుతూ అలసివుండడంచేత పాపను అతని దగ్గర్నుంచి తీసుకుని తన పక్కనే పడుకోబెట్టుకుని తాను వెనక్కు జారబడి నిద్రపోతోంది. కిటికీలోనుండి గాలి హోరుమని శబ్దంతో వస్తూ ఆమె శిరోజాల్నీ, పవిటనూ ఎగరగొడుతోంది. బయట అంత సంచలనం వున్నా ఆమె అన్నిటినీ మరిచి హాయిగా నిద్రపోతోంది!

ఓమారు పెట్టంతా కలియచూశాడు రామం. అవతల ఎవరో యిద్దరు వయసు మళ్ళిన భార్యాభర్తలు కునికిపాట్లు పడుతున్నారు. ఇంకా నాలుగుగంటల ప్రయాణం వుంది. భార్యని నిద్రలేపడం ఎందుకులే అనుకొని లేచి మెల్లగా శబ్దం చేయకుండా ఆమె పక్కన కూర్చుని గాలి తగలకుండా అద్దాలరెక్క కిందకుదింపి, శిరోజాల్ని పవిటను సర్ది తన చోటులోకి వచ్చి కూర్చున్నాడు-ఆమె ముఖంలోకే చూస్తూ.

నిద్రలోనే ఆమె అప్పుడప్పుడు సన్నగా నవ్వుతోంది. అంత నిద్రలోనూ ఒక కలకూడాను! బహుశా కలలో రామం ఆమెను దగ్గరకు తీసుకుని చుబుకాన్ని వేలితోమీటి ఏదో నవ్వు వచ్చే మాట అనివుంటాడు. అప్పుడప్పుడు రామం ఆమెను పరిహాసం చేస్తుంటాడు, నిన్ను నేనెప్పుడూ పెళ్ళాడలేదే అని. ఆ సమయంలో ఆమె అలాగే సన్నగా నవ్వుతూ వుంటుంది.

పిచ్చిపిల్ల! నేనంటే ఎంతప్రేమ-అనుకున్నాడు రామం.

సుశీల ఓమారు కళ్ళు తెరిచి భర్త యింకా అలానే కూర్చుని వుండడంచూసి "కాస్సేపు నిద్రపోగూడదూ" అని గొణిగి, అవతలి పక్కకు వత్తిగిల్లి మళ్ళీ నిద్రలోకి జారుకుంది.

రామం అలానే కూర్చున్నాడు. గడచిన రోజులు అతనికి గుర్తుకొచ్చాయి. గట్టిగా నిట్టూర్చాడు.

తనకు తెలీకుండానే తన జీవితంలో కొంతకాలం గతించిపోయింది. ఆ సమయంలో తను ఏంచేసేవాడో, ఎటు వెళ్ళేవాడో ఏమీ జ్ఞాపకంలేదు. అప్పట్లోనే తనకు పెళ్ళయ్యింది. అది అయినట్టు ఆధారాలు తప్ప కొంచెం కూడా జ్ఞాపకంలేదు. ఆ తర్వాత తన జీవితంలో పునఃసృష్టి జరిగి మళ్ళీ మనుషుల మధ్య ఒకడిగా

తిరగగలుగుతున్నాడు తను.

రామం కళ్ళముందు ఆ దృశ్యం కదలాడింది.

ఒకరోజు హాస్పిటలు గేటు తలుపులు తోసుకుంటూ తండ్రి వెనకాలే బయటికి వచ్చాడు రామం. బయట జట్కాబండి సిద్ధంగా వుంది. వెళ్ళి బండెక్కుతూ ఓమారు వెనక్కు తిరిగి హాస్పటలునంతా పరీక్షగా చూశాడు.

లోపలినుండి నలుగురైదుగురి పిచ్చికేకలూ, పేకబెత్తాల చప్పుడులూ కాంపౌండు గోడదాటి వినిపిస్తున్నాయి. అవన్నీ అతనికి పరిచితమైనవే!

అతనికి వళ్ళు జల్లుమంది. గట్టిగా ఓ నిట్టూర్పు విడిచి బండెక్కాడు. బండి హాస్పిటలు వీధి మలుపు తిరిగేవరకూ అటే చూస్తూ కూర్చున్నాడు రామం. ఎత్తయిన దాని కాంపౌండు వాలు, హాస్పిటలు పరిసరాలు,చెట్ల గుబురుల్లో కప్పడిపోగానే అతను మళ్ళీ మరోసారి బరువుగా నిట్టూర్చి బండిలో తండ్రికి దగ్గరగా జరిగి కూర్చున్నాడు.

కొన్ని సంవత్సరాలుగా అతని అధీనంలో లేని మనసు మళ్ళీ అతనికి దగ్గరగా వచ్చి చేరింది. మందగించి మూలపడిపోయిన అతని బుద్ధి మళ్ళీ కొత్త ఆలోచనల్ని కూడగట్టుకుంటోంది. మూడేళ్ళ కాలం సృష్టించిన అగాధం లాంటి ఖాళీని భర్తీచేసేందుకై మనసు గతదినాల్లోకి ప్రయాణిస్తోంది.

కాని అతనికి అవేమీ జ్ఞాపకంరావడంలేదు. అదంతా ఒక చీకటి జీవితం. పాతజీవితంలో అతనికి జ్ఞాపకం వున్నదల్లా అతను బి.ఏ చదువుతుండగా రోజూ కాలవగట్టున అర్ధరాత్రి పైబడేవరకూ గంటల తరబడి కూర్చుండిపోయిన దృశ్యంఒక్కటే.

బండి తార్రోడ్డును దాటుకుని కంకరరోడ్డులోకి అడుగుపెట్టింది. గోతుల్లో పడిలేస్తూ కుదుపుల్తో ముందుకు స్టేషన్‌వైపుపరుగెత్తి పోతోంది. తను జ్ఞాపకం రాని విషయాల్ని ఆలోచించే ప్రయత్నం చేయ్యలేక ఆలోచనల్ని కట్టిపెట్టి బండిలోంచి ముందుకువంగి రోడ్డుకి యిరుప్రక్కలా వున్న పచ్చటిచెట్లనూ, రోడ్డుపక్క దుకాణాల్నీ చూస్తూ కూర్చున్నాడు. మధ్యమధ్య పక్కకు తిరిగి తండ్రిని పలకరించి ఏదో అడుగుతున్నాడు.

కొడుకు అడుగుతున్న ప్రశ్నలకు ఏదో యధాలాపంగా సమాధానం యిస్తున్నాడుగాని అతని మనసుమాత్రం ఒకేచోట నిలిచిపోయి వుంది. బండి ఎక్కిన

దగ్గరనుండి అతను ఒక విషయం కొడుకుతో చెప్పాలనుకుంటున్నాడు. కాని ఎలా చెప్పాలో అతనికి తోచడంలేదు.

ఒకటి రెండుసార్లు కొడుకువైపు చూసి నోరు మెదపాలనుకుని తెరిచికూడా ఏమీ మాట్లాడలేక మౌనంగా వూరుకుండిపోయాడు. పదినిమిషాల తర్వాత "ఒరే రామం! నీకు పెళ్ళయిందిరా ఆ విషయం నీకేమన్నా గుర్తుందిరా." అన్నాడు తండ్రి ఉన్నట్టుండి అకస్మాత్తుగా.

రామం ఆశ్చర్యంగా చూశాడు తండ్రివైపు. అతని ఆశ్చర్యాన్ని గుర్తించి తిరిగి తండ్రే అన్నాడు. "నువ్వు పిచ్చివాడిగా నెలలకొద్దీ ఊళ్ళుపట్టి తిరుగుతుంటే పెళ్ళిచేస్తే బాగుపడతావేమోనని చేసిచూసాం. మొన్ననే రెండు వారాలకిందట నిన్ను తీసుకొస్తున్నామని చెప్పి కోడల్ని యింటికి తీసుకొచ్చాను."

రామం మనసు చివుక్కుమంది. అతనికి తండ్రిమీద ఎంతయినా కోపం వచ్చింది. తను తిరిగి మనిషిగా మారకపోతే పాపం ఆ అమ్మాయి గతి అంతేగా- అనుకున్నాడు. తండ్రిమీద కోపమే కాదు అసహ్యంకూడా కలిగింది.

'నిజంగా యీ పెళ్ళికి ఆమె మనస్ఫూర్తిగా అంగీకరించి వుండదు. బహుశా తన సంగతి వాళ్ళకు తెలీకుండా పెళ్ళి అయిందనిపించివుంటారు. లేకపోతే చూస్తూ చూస్తూ తమ కూతురుజీవితాన్ని నాశనంచేసే తల్లిదండ్రులు, తన భవిష్యత్తును అంధకారం చేసుకునే పెళ్ళికూతురు ఉంటారా? తన తండ్రి స్వార్థంతో తన కొడుకు జీవితం కోసం మరొకరి జీవితాన్ని నాశనం చెయ్యాలని చూశాడు. అదృష్టం బావుంది, ఆ వచ్చిన యిల్లాలు అడుగుపెట్టిన వేళావిశేషంవల్ల తను మామూలు మనిషయ్యాడు. లేకపోతే జీవితాంతమూ ఆమె బతకు చీకటేకదా. మాటిమాటికీ తన జీవితాన్ని తలంచుకుని కుళ్ళి కుళ్ళి ఏడవడమేకదా..... ఆమె అదృష్టవంతురాలో కాదోగాని తాను మాత్రం నిజంగా అదృష్టవంతుడు. ఆమె రాబట్టే తను మళ్ళీ మనిషయ్యాడు......' రామం జట్కాబండి స్టేషనుముందు ఆగేవరకూ ఆలోచిస్తూనే వున్నాడు.

రైలెక్కిన తర్వాత కూడా అతన్నిఆలోచనలు వదిలిపెట్టలేదు.

'ఆమె ఎలా వుంటుంది? తెల్లగా, సన్నగా అందంగా వుంటుందా?..... నవ్వుతూ నవ్విస్తూ సంతోషంతో సరదాగా మాట్లాడుతుందా?..... తనంటే ప్రేమాభిమానాలు చూపించి ప్రాణం యిస్తుందా? మరి.... తను యింతకాలం ఆమెను ఏడిపించినందుకు

తనను అసహ్యించుకుంటుందేమో! తనంటే ఆమెకు కోపమేమో? తనమీద ద్వేషమేమో? ఆమెను అన్యాయంచేసి ఆమె జీవితాన్ని నాశనం చేయాలని చూసినందుకు యిక్కడ అందరిమీదా పగపూనుతుందేమో?.....

అతను జబాబు చెప్పుకోలేని ఎన్నెన్నో ప్రశ్నలు కుప్పతిప్పలుగా వచ్చి పడుతున్నాయి. వాటికి సమాధానాల్ని ఇవ్వడానికి అతను ఉక్కిరిబిక్కిరయిపోతున్నాడు.

ఆలోచిస్తోంటే 'యీ ప్రశ్నలన్నీ ఏమిటీ?' అనిపించింది అతనికే. 'ఆమె ఎలా వుంటేనేం. నీవల్ల ఆమె జీవితాన్ని నాశనం చేసుకోలేదూ? మీరిద్దరూ అదృష్టవంతులై నువ్వు మళ్ళీ మనిషయ్యావుగాని లేకపోతే ఆమె బతుకు అంతేగా' అనిపించింది. అలా అనిపించినప్పుడు ఆమెమీద విపరీతమైన అభిమానం ఏర్పడింది.

ఆమెను గురించి రెండుమూడు విషయాలు తండ్రిని అడిగాడు-ఏవూరు? ఎవరితాలూకా? అని.

తండ్రి చాలా విషయాలు చెప్పాడు. పెళ్ళి విషయంలో పడిన శ్రమ, తీరా పెళ్ళయ్యాక గుట్టురట్టై ఆ వచ్చినవాళ్ళు గొడవపడి పిల్లను తీసుకుని వెళ్ళిపోవడం, పదిహేను రోజుల కిందట పిల్లను తీసుకువద్దామని వెళ్ళినప్పుడు,ఆమె తల్లిదండ్రులు పంపించడానికి ఒప్పుకోకపోతే ఆ అమ్మాయే వెళ్తానని పట్టుపట్టి బయల్దేరి రావడం-అన్నీ కొడుక్కి చెప్పాడు.

ఆమె ప్రేమకు అతను లోలోపలే మురిసిపోయాడు. 'నిజంగా ఆమె తనపాలిట దేవత' అనుకున్నాడు.

ఇంటికెళ్ళాక తమ్ముడు, అన్న, వదిన-అంతా పలకరించి చుట్టూ చేరారు. వాళ్ళమధ్య కొత్తముఖం ఏమీ కనిపించడంలేదు-ఒక్క అన్న కొడుకుది తప్ప. వాడూ ఎంతో చనువుగా తల్లి చంకదిగి తనదగ్గరకి రావడానికి మీదకు ఉరుకుతున్నాడు. అన్న కూతురు చిట్టి యింకొంచెం పొడుగుదేరింది.

రామన్ని చూసి పరుగెత్తుకొచ్చి తల్లి వెనకాల చేరి బితుకుబితుకుగా చూస్తోంది. రామం ఆ పిల్లను దగ్గరకు తీసుకుని, రైల్లో కొన్న పూతరేకుల పేకెట్టు చేతికిచ్చాడు. 'చిన్నాన్న వచ్చాడు...చిన్నాన్న వచ్చాడు' అంటూ అరుస్తూ మేడమీదకి పరుగెత్తింది.

వదిన కాఫీపట్టుకొస్తే తాగుతూ అందరితోనూ ఉత్సాహంగా కబుర్లు చెప్తూ మాట్లాడుతున్నాడు రామం. మేడమీదకి వెళ్ళిన చంటి అయిదు నిమిషాల్లోనే మళ్ళీ

పరుగెత్తుకొంటూవచ్చి అతని చేతుల్ని పట్టుకుని ముందుకి లాగుతూ "రా చిన్నాన్నా" అంది.

"ఎక్కడికమ్మా" అన్నాడు.

"పిన్ని ధగ్గరకి" అంది మేడమీదకి చూపించి.

"పైన వున్నట్టుంది వెళ్ళరా" అన్నాడు తండ్రి. "చిట్టీ నువ్వు యిక్కడే వుండమ్మా, చిన్నాన్నని వెళ్ళనీ" అని రామంతోపాటు బయలుదేరబోతున్న చిట్టిని ఆపేశాడు తండ్రి.

ఆమెను ఎంతవేగంగా చూద్దామా అని రామం మనసులో ఆతృతగా వుంది. వచ్చినప్పట్నించీ అతని కళ్ళు ఆమెకోసం వెతుకుతూనే వున్నాయి. ఇంట్లోవాళ్ళు మాట్లాడుతుంటే వాళ్ళను వదిలించుకుని వెళ్ళడం బావుండదని యింతసేపూ వాళ్ళతో కబుర్లు చెప్తూవున్నాడు. 'పైన వున్నట్టుంది వెళ్ళరా' అని తండ్రి అనడంతోనే లేచి బయలుదేరాడు కాని కాళ్ళు ముందుకి పడడంలేదు. ఎవరో బలంగా రెండు కాళ్ళనీ బంధించినట్టుగా వుంది. బరువుగా ఒకొక్క మెట్టుమీదా కాలువేసి మెల్లగా ఎక్కుతున్నాడు. బుర్రనిండా ఆలోచన్లు. హృదయంలో ఏదో చెప్పలేని భయం...అంతే ప్రమాణంలో ఆనందం.

ఎలాగో ధైర్యం చేసి మెట్లన్నీ ఎక్కి పైకి చేరాడు.

పైన అంతకుముందు అతను చదువుకొనే గది తెరిచివుంది. గది గుమ్మానికి అందమైన రంగురంగుల డిజైన్లతో తెల్లటి తెర ఒకటి వేలాడుతోంది. ఆ తెరమధ్య రెండు నెమళ్ళ చిత్రాలు, వాటిపైన 'సుస్వాగతం' అన్న అక్షరాలు రంగురంగు దారాల్లో జిగేల్‌మంటున్నాయి. గుమ్మానికి పసుపు, కుంకం బొట్లు, పైన పచ్చటి మామిడాకుల తోరణం శుభాన్ని సూచిస్తూ వున్నాయి.

రామం చిన్నగా శబ్దంచేసి లోపలికి వెళ్ళాడు. ఆమె వెనక్కుతిరిగి చూసి, సిగ్గుతో ముడుచుకుపోయినట్టయి పవిటను నిండుగా ఒళ్ళంతా కప్పుకుని కిటికీ పక్కకువెళ్ళి నుంచుంది.

రామం కొద్దిక్షణాలు ఆమెను అలానే చూస్తూ నుంచుండిపోయాడు. ఆ తర్వాత మెల్లగా కదిలి ఆమెకు దగ్గరగా వెళ్ళాడు. మనసులోని సంతోషాన్నీ, బాధనూ మిళితంచేసి అక్షరాల్లోకి వంపి మెల్లగా "సుశీలా"! అన్నాడు ఆమె రెండు భుజాల్నీ పట్టుకుని తనవైపు తిప్పుకుని ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

దుఃఖమో ఆనందమో ఆమె కళ్ళు జలజలా వర్షించాయి. ఆమె అతని భుజాలమీద వాలి వెక్కివెక్కి ఏడుస్తోంది.

అతను జేబురుమాలుతో ఆమె కన్నీళ్ళు అద్ది "ఛ! ఏడవవచ్చా...నవ్వాలిగాని" అంటూ ఓదార్చాడు. అతను ఓదార్చుతుంటే ఆమెకు దుఃఖం మరింతగా కట్టలు తెంచుకుని పొర్లిపోతోంది. అతను మౌనంగా వుండిపోయాడు.

రెండు నిమిషాలతర్వాత తనకుతనే సంబాళించుకుని కళ్ళువత్తుకుని అతని ముఖంలోకి చూసింది.

రామం ఆమె చేతుల్ని పట్టుకుని "నన్ను క్షమించు సుశీలా! ఈ మూడేళ్ళూ నీకెంతో బాధ కలిగించాను" అన్నాడు.

ఆమె తన సన్నని లేతతీగలాంటి చేతివేళ్ళను అతని పెదవులమీద వుంచి "అలా అనకండి" అంది. వీణ తీగలు మీటగా శబ్దం బైటపడ్డట్టు మృదువుగా ధ్వనించాయా మాటలు!

రామం అక్కడే మంచంమీద కూర్చున్నాడు. ఆమెను తన పక్కనే కూర్చోబెట్టు కున్నాడు. ఆమె కళ్ళల్లోకి చూస్తూ "ఎంత అందంగా వున్నావు సుశీలా!" అన్నాడు.

సుశీల మనసు సంతోషంతో గంతులేసింది. ఆమె హృదయంలో మయూరాలు నాట్యంచేశాయి.

గోదావరి కృష్ణవేణమ్మలు గలగలలాడుతూ పరుగెత్తాయి. మైసూరు మంచిగంధం సువాసనలు అన్ని వైపుకూ పరుగులుతీసాయి.

ఆమె తేలిగ్గా, హాయిగా, ఆనందంగా చిరునవ్వు నవ్వింది.

రెండు జీవితాల్లో వసంతం వెల్లివిరిసి వికసించిననాడు, ఆ వసంత శోభకు చిహ్నంగా బాధల్నీ, భయాన్నీ, దుఃఖాన్నీ, సంకోచాన్నీ దాటుకుని తొలిసారిగా వెలువడిన ఆ నవ్వును అతను మర్చిపోలేడు. అది అతని గుండెల్లో స్థిరంగా నిలిచిపోయింది.

ఇప్పుడు సుశీల అలా రైల్లో నిద్రపోతూ కలగంటూ నవ్వినప్పుడు ఆ నవ్వు, మళ్ళీ మరొక్కమారు గతించిన గాథనంతా అతని హృదయంనుండి తోడి కళ్ళముందు పెట్టింది.

రామం చటుక్కున లేచాడు. పెట్లో ఆవైపున కూర్చున్న వయసు మళ్ళిన

దంపతులు కూడా లేరు. అవతలగా కూర్చున్న మిగతావాళ్ళు కునికిపాట్లు పడుతున్నారు. నిద్రపోతోన్న సుశీల పక్కకు వెళ్ళి కూర్చుని ఆమెను తట్టిలేపాడు.

ఆమె కళ్ళు విప్పి కంగారుగా భర్తవైపు చూసింది. అతను ఆమె ముఖంలో ముఖంపెట్టి "నేను మళ్ళీ మనిషిగా మారకపోతే నువ్వేం చేసేదానివి సుశీలా?" అన్నాడు.

ఆమె ఏమీ మాట్లాడలేదు. తలెత్తి భర్తముఖంలోకి చూసింది.

'చెప్పు సుశీలా' అన్నట్టు కళ్ళతోనే అడుగుతున్నాడు.

"వద్దు..ఆ ప్రశ్నవేసి నన్ను భయపెట్టకండి. మళ్ళీ వేస్తే నా మీద ఒట్టే" అంది ఆమె. అతని చేతిని తన చేతుల్లోకి తీసుకుని గట్టిగా పట్టుకుంది.

సన్నటి పొడవాటి ఆమె చేతివేళ్ళు వణకడం అతనికి స్పష్టంగా తెలుస్తూనే వుంది. అతను రెండో చేతినికూడా వాటిమీద వేసి గట్టిగా పట్టుకున్నాడు.

✪